
సాక్షి గుంటూరు

బుధవారం । 11 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 534 క్యూసెక్కులు విడుదల చేశారు.

కరోనా జీరో



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జిగా నియామకం



గోపాలకృష్ణారావు

గుంటూరులీగల్: గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న వి.గోపాలకృష్ణారావును ఏపీ హైకోర్టు జడ్జిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. సుప్రీంకోర్టు కొలీజియం సమావేశం మంగళవారం న్యూఢిల్లీలో జరిగింది.

రేపు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): అండర్-18 యువతీ యువకుల జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఎదుటగల ఎన్‌జీఓ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ మహేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాల కోసం బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ సెల్‌నెంబర్ 9396990666లో సంప్రదించాలన్నారు.

డీఎంహెచ్‌ఓ సరెండర్

గుంటూరుమెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుమయఖాన్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆమెపై తీవ్ర ఫిర్యాదులు రావడంతో పరిపాలనాపరమైన తప్పిదాలు జరిగినట్లు నిర్ధారించి సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా డాక్టర్ జె.హనుమంతరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ హనుమంతరావు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

హెచ్‌ఎంల లాగిన్‌లో టెన్త్ విద్యార్థుల జాబితా

వివరాలు సరి చేసుకునేందుకు 20 వరకు గడువు

గుంటూరుఎడ్యుకేషన్: ఏప్రిల్ నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల జాబితాలను ఆయా పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో ఉంచినట్లు డీఈఓ పి.శైలజ మంగళవారం తెలిపారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, భాషతోపాటు మీడియం సవరణ, అంగవైకల్యం, ఒకేషనల్ సబ్జెక్టులు, పుట్టుమచ్చలు, ఫొటో, సంతకం సవరణ కోసం ఈనెల 11వ తేదీ నుంచి 20లోపు ఎడిట్ ఆప్షన్ ద్వారా సరైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో సమర్పించిన నామినల్ రోల్స్‌లో తప్పులు ఉంటే, వాటిని సవరించి సరైన వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎంలు ధ్రువీకరించిన విద్యార్థుల వివరాలతో హాల్‌టికెట్లు జారీ అవుతాయని స్పష్టం చేశారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



పట్నంబజారు: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమానులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. మంగళవారం గుంటూరులోని రవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి తనిఖీలు ప్రారంభించామని, అధికంగా వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్టీసీ చార్జీలనే ప్రామాణికంగా తీసుకుంటామని, మార్గం మధ్యలో ప్రయాణికులను విచారిస్తామని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ యాజమాన్యాలు వ్యవహరించాలని సూచించారు.

యార్డుకు 69,966 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 69,966 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 67,957 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.28,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.20,000 నుంచి రూ.27,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.12,300 నుంచి రూ.21,000 వరకు ధర పలికింది.

రుణ లక్ష్యం ఘనం

- 2022-23 జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో సేద్యానికి ప్రాధాన్యం
- రూ.22,400 కోట్లలో వ్యవసాయానికి 50 శాతం కేటాయింపు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతన్నకు వెన్నుదన్ను
- నాలుగేళ్లుగా అన్నదాతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతును రాజుగా చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారు. వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం కీలక భాగస్వామ్యంగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2020 ఆర్థిక సంవత్సరానికి ముందు రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే బ్యాంకర్లు నిర్లక్ష్యంగా చూశారు. దీనికి అప్పటి తెలుగుదేశం హయాంలో నెలకొన్న కరువు పరిస్థితులే కారణం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం ఉమ్మడి గుంటూరు జిల్లా కరువుతో తల్లడిల్లిపోయింది.

ప్రతి సీజన్‌లోనూ కరువు విలయతాండవం చేసింది. పంట రుణం తీసుకుంటే రైతు తిరిగి చెల్లించలేని దుర్భరస్థితి. పాలన మారింది. ప్రకృతి సైతం పులకించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. మరోపక్క ప్రకృతి కరుణించి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలవనరులన్నీ ఏడాదంతా జలకళను సంతరించుకుంటున్నాయి. సకాలంలో సాగు చేస్తూ పంటలు పండిస్తున్నారు. ఇంకో పక్క రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయానికి అండగా నిలబడటంతోపాటు ఏడాదికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాయం అందిస్తున్నారు. రైతుకు చేతినిండా డబ్బు అందించి వ్యవసాయాన్ని పండగలా చేసుకుంటూ పోతున్నారు.

వ్యవసాయానికి రూ.11,100 కోట్లు

విభజిత నూతన గుంటూరు జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి అన్ని రంగాలకు కలిపి బ్యాంకులు రూ.22,400 కోట్లు రుణ ప్రణాళికగా నిర్ణయించారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.11,100 కోట్లు రుణాలు ఇచ్చేందుకు రుణ ప్రణాళికను రూపొందించారు. పంట రుణాలతోపాటు భూ అభివృద్ధి, ఉద్యానవనం, డెయిరీ, ఫౌల్ట్రీ, ఫిషరీస్, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పెద్దఎత్తున రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నారు. వ్యవసాయానికి కేటాయించిన మొత్తంలో కూడా పంట రుణాలకే రూ.8,500 కోట్లు కేటాయించారు. అందులో ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో రూ.5,300 కోట్లు రైతులకు రుణాలు ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.2,800 కోట్లు రుణాలు అందజేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పంట రుణాలతోపాటు ఇతర వ్యవసాయ రుణాలకుగాను ఇప్పటి వరకు సుమారు రూ.1,920 కోట్లు రుణాలు అందజేశారు.

వ్యవసాయేతర రంగాలకు కూడా...

జిల్లాలో వ్యవసాయ రంగంతోపాటు వ్యవసాయేతర రంగాలకు కూడా బ్యాంకుల నుంచి రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది రుణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 50 శాతం కేటాయించారు. వీటితోపాటు మైక్రో, చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రూ.3,866 కోట్లు కేటాయించగా, రెండో త్రైమాసికం ముగిసే లోపు (సెప్టెంబర్ మాసం చివరి వరకు) రూ.3,714 కోట్లు అంటే 96 శాతం ఇచ్చారు. ముద్రా రుణాలు జిల్లాలో ఈ ఏడాది 32,984 మందికి రూ.329 కోట్లు ఇచ్చారు. జగనన్న తోడు పథకం కింద మూడేళ్లలో 68,162 మందికి రూ.69 కోట్లు ఇచ్చారు. టిడ్కో హౌసింగ్ లోన్లు లక్ష్యం 12,052 మందికిగాను ఐదు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో 8,457 మందికి రుణాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఈ ఏడాది 44,539 మందికి రూ.631 కోట్లు రుణాలు అందించారు. ముస్లిం మైనారిటీలకు 67,314 మందికి రూ.1,489 కోట్లు రుణాలు ఇచ్చారు. జిల్లాలో మహిళలకు అన్ని లోన్లు కలిపి 1,82,955 మందికి రూ.3,002 కోట్లు అందించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, జీడీసీసీ బ్యాంక్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అన్నీ కలిపి అన్ని రంగాలకు కలిపి రుణాలను అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రుణ లక్ష్యం అధిగమిస్తాం...



జిల్లాలో కేటాయించిన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నాం. 2021-22 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంలో 95 శాతం రుణాలు అందిస్తున్నాం. వ్యవసాయ రంగంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగానికి, ఇతర ప్రాధాన్యత రంగాలకు కూడా రుణాలు అందించి ప్రోత్సహించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే సంస్థలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం.

–ఈదర రాంబాబు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, గుంటూరు.

14 నుంచి రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

యద్దనపూడి: ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుదే పాండు రంగారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో నాటిక పోటీలు అనంతవరం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటిరోజు తొలినాటికగా పెట్రోమాక్స్ పంచాయతీ, హైదరాబాద్ వారిచే పక్కింటి మొగుడు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 15వ తేదీ మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారిచే అందని ఆకాశం, గంగోత్రి పెదకాకాని వారిచే పేగురాసిన శాసనం, కళాంజలి హైదరాబాద్ వారిచే మనిషి మంచోడే, 16న చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే చీకటిపువ్వు, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే గమ్యస్థానాల వైపు, అంజలి రాథోడ్ థియేటర్స్ చిలకలూరిపేట వారిచే నాన్న నేను వచ్చేస్తా, 17న యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారిచే రాతిలో తేమ, అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే అతీతం, ఉషోదయ, కళానికేతన్, కాట్రపాడు వారిచే యాది, 18న చైతన్యకళా స్రవంతి విశాఖ వారిచే గుడి ఎనక నా సామి, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే వెండి అంచులు, న్యూస్టార్ మోడల్ థియేటర్ విజయవాడ వారిచే పిపీలికం, రసఝరి పొన్నూరు వారిచే గుర్తు తెలియని శవం ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. తొలిరోజు ముఖ్య అతిథులుగా సినీ దర్శక, నిర్మాత వైవీఎస్ చౌదరి, సినీ దర్శకుడు అనీల్ రావిపూడి పాల్గొంటారన్నారు. జి.వెంకటసుబ్బారావు, శ్రీనివాసరావు ఉన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

- నెల రోజుల వ్యవధిలో 24 లక్షల చేప పిల్లలను వదిలాం
- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



కృష్ణానదిలో చేపపిల్లలను వదులుతున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులను అన్నివిధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటున్నాయని, మీనోత్సవంలో భాగంగా కృష్ణానది ఎగువ ప్రాంతంలో చేప పిల్లలను వదిలి మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో ఉండవల్లి మత్స్యకార సొసైటీ వద్ద ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 8 లక్షల చేప పిల్లలను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)లతో కలసి నీటిలో వదిలారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులను ఆదుకునేందుకు ఆనాడు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి వారి సంక్షేమానికి కృషి చేశారని, నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదేవిధంగా కృషి చేస్తున్నారని అన్నారు. వేట విరామ సమయంలో ప్రతి ఒక్క మత్స్యకారుడికి జీవనోపాధి కింద రూ.24 వేలు చెల్లిస్తూ వారిని ఆదుకుంటున్నారు. చేపలు ఎగుమతి చేసే సమయంలో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతుండడంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఫిష్ ఆంధ్రా పేరుతో ఫిష్‌మాల్ ఏర్పాటు చేసి అమ్ముకునే విధంగా చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఉండవల్లి, ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో మత్స్యకారుల కోసం సొసైటీ బిల్డింగ్, చేపల మార్కెట్ ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మత్స్యకారులకు సబ్సిడీపై ఆరు ద్విచక్ర వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ వీవీఆర్ బాబు, ఎఫ్‌డీవోలు సీహెచ్ ప్రసాద్, ఎండీ జాన్ ఉల్ఫ్‌ఖాన్, ఎంపీడీఓ రామప్రసన్న, డీటీ వి.రమణరాజు, ఆర్ఐ ప్రశాంతి, ఉండవల్లి సెక్రటరీ రాధాకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి, మంగళగిరి పట్టణ కన్వీనర్లు బుర్రముక్కు వేణుగోపాల రెడ్డి, మునగాల మల్లేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ సైకం మల్లి, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ కన్వీనర్లు బాలసాని అనిల్, బత్తుల దాసు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1400, గరిష్ట ధర రూ.1900, మోడల్ ధర రూ.1600 వరకు పలికింది.

సర్కారు బడులకు సొబగులు

- నాడు-నేడు మొదటి విడతలో జరిగిన పనులకు తుది మెరుగులు
- సెలవుల తర్వాత సరికొత్తగా ముస్తాబు కానున్న పాఠశాలలు
- హెచ్‌ఎంలు అందుబాటులో ఉండి పనులు చేయించుకోవాలని సూచన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,149 పాఠశాలల్లో నాడు-నేడు పనులు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



నాడు-నేడు ద్వారా ఆధునీకరించిన గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల

గుంటూరుఎడ్యుకేషన్: మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలలను ఆధునిక హంగులతో ఆధునీకరించిన ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో కల్పించిన సదుపాయాలను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. నాడు-నేడు మొదటి దశలో ఆధునీకరించిన పాఠశాలల్లో చూడగానే ఆకట్టుకునే విధంగా భవనాలు, గోడలు, కిటికీలకు పెయింటింగ్స్‌తో ఆకర్షణీయమైన శోభను తీసుకువచ్చిన ప్రభుత్వం వాటి నిర్వహణపై దృష్టి సారించింది. రంగులు వెలసిన పాఠశాల భవనాలు, గోడలకు మరలా పెయింటింగ్స్ వేయించడంతోపాటు విద్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు ప్రతి పాఠశాలలో రూ.లక్షలాది వ్యయంతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠశాలల్లో పనిచేయని, పాడైన ఆర్వో వాటర్ ప్లాంట్లకు సర్వీసింగ్ చేయించి, తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. నాడు-నేడు మొదటి దశలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,149 పాఠశాలలను ప్రభుత్వం రూ.242.19 కోట్ల వ్యయంతో ఆధునీకరించి, 10 రకాల మౌలిక వసతులను కల్పించింది. ప్రతి పాఠశాలను గతంలో ఎన్నడూ చూడని విధంగా ఆకర్షణీయమైన రంగులతో సరికొత్తగా తీర్చిదిద్దేందుకు పెయింట్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. మొదటి దశలో అభివృద్ధి పర్చిన పాఠశాలల పరిధిలో భవనాలు, గోడలు, కిటికీలు, తరగతి గదుల వెలుపల వేసిన పెయింటింగ్స్ పాడైన చోట కొత్తగా వేసేందుకు నిర్ణయించిన ఉన్నతాధికారులు, సంబంధిత పనులను సంక్రాంతి సెలవుల్లో పూర్తిచేసేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆయా కంపెనీలకు సమాచారాన్ని పంపించారు. పాఠశాలల నుంచి వచ్చిన వర్క్ ఆర్డర్ ప్రకారం ఆయా కంపెనీల సిబ్బంది సంక్రాంతి సెలవుల్లో పాఠశాలలకు వచ్చి పెయింటింగ్స్ పనులు నిర్వహించనున్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్లకు సర్వీసింగ్

విద్యార్థులకు సురక్షితమైన నీటిని అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్స్, ఆర్వో వాటర్ సిస్టమ్స్‌ను పూర్తిస్థాయిలో సర్వీసింగ్ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,149 పాఠశాలల్లో మూడు వేర్వేరు రకాల ఆర్వో వాటర్ సిస్టమ్స్, ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని క్షేత్రస్థాయిలో వినియోగించకపోవడం, సరిగా వాడకపోవడంతో మరమ్మతులకు గురికావడంతోపాటు పని చేయకపోవడం వంటివి ఉన్నాయి. హెచ్‌ఎంల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆర్వో వాటర్ సిస్టమ్స్ సరఫరాదారులు తమ సాంకేతిక సిబ్బందిని పాఠశాలలకు పంపి, ఆర్వో వాటర్ సిస్టమ్స్‌కు సర్వీసింగ్ చేయించనున్నారు. పెయింటింగ్స్‌తోపాటు ఆర్వో వాటర్ సిస్టమ్స్ సర్వీసింగ్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించనుంది. అయా పనులన్నింటినీ సంక్రాంతి సెలవుల్లో చేపట్టి, సెలవుల అనంతరం పాఠశాలలను అందంగా ముస్తాబు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆయా పనులను పూర్తిచేసిన తర్వాత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నవీ, లేనివీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో తనిఖీ చేయిస్తుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

స్లీప్ వెల్

మీకు నిద్ర పట్టడం లేదా.. అయితే జీజీహెచ్‌కు రండి

గుంటూరు నగరానికి చెందిన ఒక టీనేజ్ బాలికకు నిద్ర పట్టడం లేదని గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ స్లీప్‌ల్యాబ్‌కు తీసుకొచ్చారు. స్లీప్‌ల్యాబ్‌లో ఓ రాత్రి ఉంచి పరీక్ష చేసి, చదువుల ఒత్తిడి వల్లే బాలిక ఇంట్లో నిద్ర పోవటం లేదనే విషయాన్ని న్యూరాలజీ వైద్యులు నిర్ధారించారు. వినటానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది ముమ్మాటికీ నిజం. - గుంటూరు మెడికల్

- పిల్లలకు సైతం నిద్రలేమి సమస్యలు
- నిద్రలేమితో అనేక అనర్థాలు
- గుంటూరు జీజీహెచ్‌లో స్లీప్ ల్యాబ్ ఏర్పాటు.. ఉచితంగా వైద్య పరీక్షలు



స్లీప్‌ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన వైద్య పరికరం, మంచం

సాధారణంగా పెద్ద వయస్సు వారికి నిద్ర పట్టదని అనుకుంటారు. కాని నేడు ఆధునిక జీవనశైలి, స్మార్ట్ ఫోన్స్ యుగంలో ప్రతి ఒక్కరు కాలంతో పరుగులు తీస్తూ ఉండటం వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థి మొదలుకొని పెద్దవారి వరకు అనేక మంది నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. నిద్రలేమి సమస్యలను ముందుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో అనేక అనర్థాలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో జీజీహెచ్‌లోనే 'స్లీప్‌ల్యాబ్'

మీకు నిద్ర పట్టడం లేదా... అయితే గుంటూరు జీజీహెచ్‌కు రండి. ఈ మాట వినేందుకు ఆశ్చర్యంగా ఉన్నా నిజమే. నిద్ర పట్టకపోవటానికి గల కారణాలను వైద్య పరీక్షల ద్వారా తెలుసుకుని మాయిగా నిద్రపోయేందుకు కావాల్సిన వైద్యాన్ని జీజీహెచ్ వైద్యులు అందిస్తారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 'స్లీప్ ల్యాబ్'ను న్యూరాలజీ వైద్యులు దాతల సాయంతో ఏర్పాటుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్లీప్‌ల్యాబ్‌ను ఏర్పాటుచేసిన మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి రికార్డు సృష్టించింది. నాట్కో ఫార్మా కంపెనీ సంస్థ చైర్మన్ నన్నపనేని వెంకయ్యచౌదరి న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలు చేసేందుకు రూ.25 లక్షలు ఆర్థికసాయం చేశారు.

నిద్ర సమస్యలకు చెక్...

మనిషి జీవిత కాలంలో సగం సమయం నిద్రించేందుకే కేటాయిస్తున్నారు. నిద్రలేకపోతే ఏకాగ్రత లోపించడం, నిర్ణయం సకాలంలో తీసుకోలేకపోవడం, నిరాశ, నిసత్తువ, నీరసం, విసుగు, తలనొప్పి, ఇతర రుగ్మతలు తలెత్తుతాయి. ఫిజికల్‌గా, మెంటల్‌గా, ఎమోషనల్‌గా మనిషి ఫిట్‌గా ఉండదు. కనీసం మనిషి 8 గంటలు నిద్రపోని పక్షంలో పైన పేర్కొన్న రుగ్మతలతోపాటు హార్ట్‌ఎటాక్ సైతం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వైద్యనిపుణులు తెలిపారు. కాఫీ, టీలు ఎక్కువగా తీసుకునేవారిలో నిద్రపట్టదు. ఊబకాయం ఉన్నవారు సైతం రాత్రిళ్లు నిద్రపట్టక గురక పెడుతూ మధ్యలో నిద్రాభంగంతో లేస్తుంటారు. నిద్రలో లేచి నడవడం, నిద్రలో సైకిల్ తొక్కినట్లు కాళ్లు కదిలించడం, నిద్రలో ఫిట్స్ రావడం వల్ల వారు నిద్రపోవటానికి భయపడతారు.

ఆరేళ్లుగా ఉచితంగా వైద్యపరీక్షలు...



స్లీప్‌ల్యాబ్‌లో 2018 జనవరి నుంచి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. 2018లో 47 మందికి, 2019లో 40 మందికి, 2021లో 14 మందికి, 2022లో 20 మందికి స్లీప్‌ల్యాబ్‌లో వైద్యపరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి వైద్యసేవలు అందించారు. 2020లో కోవిడ్ వల్ల వైద్య పరీక్షలు నిలిపివేశారు. నిద్ర సమస్యలతో వచ్చేవారిలో ఆడవారి కంటే మగవారే ఎక్కువగా ఉంటున్నారు. 13 ఏళ్ల నుంచి 20 ఏళ్లవారు కూడా నిద్ర సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం రావటం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్రంలో గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే నిద్రలేమి సమస్యలను నిర్ధారించే పాలిసోనోగ్రఫీ(పిసిజి) పరీక్ష చేస్తున్నారు. సుమారు రూ.25వేల ఖరీదు చేసే పీసీజీ పరీక్షను న్యూరాలజీలో ఉచితంగా చేస్తున్నారు.

– డాక్టర్ నాగార్జునకొండ సుందరాచారి, న్యూరాలజీ వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

రుగ్మతల నిర్ధారణకు స్లీప్‌ల్యాబ్...

పైన పేర్కొన్న రుగ్మతలు రావడానికి గల కారణాలు నిర్ధారించేందుకు స్లీప్ ల్యాబ్ ఉపయోగపడుతుంది. కొంత మంది రాత్రివేళలో నిద్రపోకుండా, పగటి పూట నిద్రిస్తుంటారు. దీని వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్‌ల అనేకం ఉన్నాయి. ఎలాంటి సమయాల్లో నిద్రపోవాలి, నిద్రపోకపోతే ఎలాంటి అనర్థాలు తలెత్తుతాయి తదితర విషయాలను స్లీప్ డిజార్డర్‌తో బాధపడేవారికి స్లీప్ ల్యాబ్‌లో వైద్య పరీక్షలు చేసి వివరిస్తున్నారు.

మానవత్వం చాటిన బాపట్ల జిల్లా కలెక్టర్



బాపట్ల: బాపట్ల జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ మానవత్వాన్ని చాటుకున్నారు. కళ్లు కనిపించక ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలికి శస్త్ర చికిత్స చేయించారు. అంతేగాకుండా ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం చేశారు. వృద్ధురాలు మంగళవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామంలో నెల రోజుల కిందట జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ పర్యటించారు. ఆ సమయంలో రహదారి వెంట ఇల్లు కూడా సరిగా లేక ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు బల్లాని నాగమల్లేశ్వరిని గమనించారు. ఆమె అంధత్వంతో ఇబ్బంది పడుతుండటాన్ని గుర్తించారు. వృద్ధురాలి భర్త వెంకటసుబ్బయ్య మృతి చెందాడని, అప్పటినుంచి ఆమె ఒంటరిగానే ప్రభుత్వం అందించే సామాజిక భద్రత పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ గుంటూరులోని శంకర నేత్రాలయం వారితో మాట్లాడారు. వృద్ధురాలికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయించారు. శిథిలమైన పూరి గుడిసె స్థానంలో పక్కా గృహాన్ని మంజూరు చేశారు. గృహ నిర్మాణం కోసం మరో రూ.20 వేలు అందించారు.

క్లుప్తంగా

తండ్రీ, కొడుకు మధ్య ఘర్షణలో తండ్రి మృతి



పాతబొమ్మువానిపాలెం(కొల్లిపర): తండ్రీ, కొడుకు మధ్య ఘర్షణలో కొడుకు చేతిలో తండ్రి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి కొల్లిపర మండలం పాత బొమ్మువానిపాలెంలోని ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గ్రామానికి చెందిన డి.రాజు(55) అర్ధరాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన కొడుకు మౌని కుమార్‌తో గొడవకు దిగాడు. మద్యం మత్తులో ఉన్న తండ్రిని మౌని కుమార్ బలవంతంగా నెట్టడంతో వెనకనే ఉన్న గోడకు తగిలి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మౌని కుమారుని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.రవీంద్ర రెడ్డి తెలిపారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కారానికి చర్యలు



బాపట్ల అర్బన్: స్థానిక మున్సిపల్ హైస్కూలు, గురుకుల పాఠశాలను రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషనర్ బి.పద్మావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూలులో 30 మందిబడిమాని వేసినట్లు గుర్తించామన్నారు. ఫిర్యాదులపై పోలీసులు, బాలుర సంరక్షణ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారుల సహకారంతో విచారించి పరిష్కారించాలని సూచించారు. మున్సిపల్‌హైస్కూలులో విద్యార్థులు చెట్ల కింద కూర్చోని చదువుతున్నట్లు గమనించామని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టామని చెప్పారు. 9, 10 తరగతి విద్యార్థులు గొడవ పడినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీరికి పోలీసులతో కౌన్సెలింగ్ ఇప్పించాలని, నైతిక విలువలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.నిరంజన్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ,కత్తి శ్రీనివాసరావు, ఎస్ఐ షేక్.మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

చేబ్రోలు: సంక్రాంతి అంటేనే రైతుల పండుగని, పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలని విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగురంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో రైతు లోకం పంట చేతికొచ్చిన ఆనందంలో ఉంటుందని చెప్పారు. పల్లెటూళ్లు ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉంటాయని చెప్పారు. ఎడ్ల పందేలు, కోడి పందేలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు.. ఇలా సంక్రాంతి అంటేనే సరదాల పండుగ అని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోమాతను పూజించి, పొంగళ్లు పొంగించారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. చెరకు గడలు అల్లారు. రంగురంగుల ముగ్గులు వేశారు. భోగిమంటలు వేశారు. సంక్రాంతి విశిష్టతను తెలిపేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. వీసీ పీ నాగభూషణం పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థుల ప్రదర్శనలు



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

టీబీ పేషెంట్లకు పౌష్టికాహార కిట్లు

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: నిక్షయ మిత్ర పథకం కింద టీబీ వ్యాధిగ్రస్తులకు ఈనెల మూడో వారంలో పౌష్టికాహార కిట్లు అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం కింద ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన నిక్షయమిత్ర కార్యక్రమంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాధిగ్రస్తునికి ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందజేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా దాతలు, ఉద్యోగస్తుల నుంచి సుమారుగా రూ.24 లక్షలు సేకరించినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే ఇంత మొత్తం నిధులు సేకరించిన ఏకైక జిల్లాగా పల్నాడు నిలిచిందన్నారు. ఒక్కొక్కరికి రూ.700 విలువ చేసే పౌష్టికాహార కిట్లను ఆరునెలల పాటు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క పౌష్టికాహార కిట్లలో కేజీ చొప్పున వేరు శనగ, కందిపప్పు, అరకేజీ చొప్పున గోధుమ పిండి, రాగి పిండి, శనగలు, బెల్లం, వంట నూనె, బియ్యం వంటివి ఉంటాయన్నారు. వీటిని ఆయా శాఖల అనుబంధంతో ప్యాకేజీ చేసి పేషెంట్లకు అందజేసే విధంగా రవాణా సౌకర్యాలు కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఈనెల మూడో వారంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు సమక్షంలో కిట్లు అందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ నాటికి కిట్ల తయారీ పూర్తి కావాలని ఆదేశించారు. రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు 50 మందిని, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు వందమందిని, నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 50 మందిని, శాసనసభ్యులు నంబూరు శంకర్‌రావు 50 మందిని, గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి 50 మందిని దత్తత తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. అదే విధంగా అసిస్ట్ ఇండియా, రోటరీక్లబ్, రెడ్‌క్రాస్, జీకేఎస్ చారిటబుల్ ట్రస్ట్ వంటి స్వచ్ఛంద సేవాసంస్థలు కూడా పలువురిని దత్తత తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా టీబీ అధికారి డాక్టర్ పద్మావతి, డీసీహెచ్ఎస్ రంగారావు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి మోహన్‌బాబు, పౌరసరఫరాల శాఖ డీఎం వరలక్ష్మి, ఏపీ ఎంఐడీసీ అధికారి సిహెచ్.ఆంజనేయులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని రీసర్వే

గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అనుసరించి మిగతా జిల్లాల కన్నా భిన్నంగా భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పనుల నిర్వహణ తీరుపై మంగళవారం కలెక్టరేట్ నుంచి కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే పనుల్లో సిబ్బంది తప్పనిసరిగా విధులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డీ.ఆర్.ఓ వినాయకం, పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ జి.వసంతబాబు, కలెక్టరేట్ ఏఓ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు అన్ని హంగులు

మార్కెటింగ్ జేడీఏ శ్రీనివాసరావు

మార్టూరు: రాష్ట్రంలో అతి పెద్ద కూరగాయల మార్కెట్లలో ఒకటైన మార్టూరు కూరగాయల మార్కెట్‌లో రైతులకు, వ్యాపారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ జేడీఏ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కూరగాయల మార్కెట్‌ను మంగళవారం పరిశీలించిన ఆయన రైతులు, వ్యాపారులు, హమాలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా హమాలీలు మార్కెట్‌లో తమకు భోజనం చేయటానికి విశ్రాంతి కోసం గది అవసరమని ఆయనను సంప్రదించగా అంచనాలు రూపొందించి గది ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ వెనుక వైపు ఖాళీగా ఉన్న నూతన గోదామును వ్యాపారులతో కలసి పరిశీలించి అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. సంక్రాంతి అనంతరం హమాలీలకు లైసెన్సులు, యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకుడు బత్తుల హనుమంతరావు కూరగాయల మార్కెట్ వెలుపల రోడ్డుపై ఉంటూ ఆకుకూరలు విక్రయించుకునే చిరువ్యాపారుల నుంచి రోజూవారీ అద్దెను వసూలు చేయవద్దని జేడీఏ దృష్టికి తీసుకు వెళ్లారు. జేడీఏ పరిశీలించి తగు చర్యలుతీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కన్నెగంటి శ్రీనివాసరావు, దారా రామారావు, ఎస్ఎంబీ బుడే, సంజీవరావు, బత్తుల హనుమంతరావు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీతో ఆర్థికాభివృద్ధి

చీరాల టౌన్: మహిళల ఆహార ఉత్పత్తుల తయారీతో ఆర్థికాభివృద్ధి చెందుతారని డీఆర్‌డీఏ పీడీ బీ.అర్జునరావు అన్నారు. మంగళవారం స్త్రీశక్తి భవన్‌లోని వైఎస్సార్ కేపీ కార్యాలయంలో ఆహార ఉత్పత్తులపై పొదుపు మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరెక్టర్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ తీసుకున్న వారు వ్యాపార రంగంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆహార ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడంతో పాటు జీవన విధానాలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎంఈఎంఈ పథకంలో మండలంలో 122 మందికి రూ.48.80 లక్షల రుణాలు అందిస్తున్నామని రుణాలను సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలని సూచించారు. మూడు రోజుల పాటు నిర్వహించి శిక్షణలో పలు సూచనలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శిక్షకులు పి.వెంకటనారాయణ, డీపీఎం రవికుమార్, ప్రమీల, ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్, ఏపీఎం మోహనరావు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ శాప్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కన్వీనర్ కె.నాగరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పోటీలను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించనున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

- 4 కిలోలు స్వాధీనం
- తాడేపల్లి సీఐ శేషగిరిరావు వెల్లడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతానగరం బోటు యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తాడేపల్లి సీఐలు శేషగిరిరావు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించగా ఆ సమయంలో కొలనుకొండకు చెందిన కావలి ఉపేంద్ర ఇంట్లో గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా సీతానగరానికి చెందిన వల్లూరి రోజా తనకు గంజాయి ఇచ్చినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే తమ సిబ్బంది మారు వేషంలో రోజా ఇంటికి వెళ్లగా ఆ సమయంలో వల్లూరి సుబ్రహ్మణ్యం గంజాయి ప్యాకెట్లు బయటకు తీసుకు వచ్చాడని, అతడిని అదుపులోకి తీసుకోగా పాత నేరస్తురాలు అయిన రోజా విషయం బయటకు వచ్చిందని, ఆమె మరిది అయిన సుబ్రహ్మణ్యం నర్సీపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలు తయారు చేసి అమ్ముతున్నారని వివరించారు. వీరి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మేవారిని పట్టుకోవడంలో చాకచక్యం చూపించిన ఎస్ఐ రమేష్, ఇతర సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ సాంబశివరావు, ఎస్ఐలు వినోద్, శ్రీనివాసరావు, నారాయణ పాల్గొన్నారు.



గంజాయి అమ్ముతున్న వారిని విలేకరులకు చూపుతున్న తాడేపల్లి సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు

రాత్రి వేళ గస్తీని పటిష్టం చేయాలి

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల: రాత్రి వేళల్లో గస్తీ పటిష్టంగా నిర్వహిస్తే నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని వార్డు సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్ వెబ్‌సైట్‌లో వారి రోజువారీ విధుల వివరాలు పొందుపరుస్తున్నారా లేదా.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పాత నేరస్తుల కదలికలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూసంక్రాంతి పండుగకు కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు గురించి ప్రజలకు అవగాహన కలిపించాలని సిబ్బందికి సూచించారు. అలానే రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించే పోలీస్ అధికారులు వాహనాలకు తప్పనిసరిగా సైరన్ ఉండాలని చెప్పారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రదేశాలలో, రహదారులపై తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. 216 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ఇసుకతో నింపిన డ్రమ్ములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ రాత్రి వేళల్లో హైవేపై తొలగించి ఉదయం తిరిగి ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ పీ.శ్రీకాంత్, టూటౌన్ సీఐ సోమశేఖర్, జిల్లా స్పెషల్ బ్రాంచి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు.. ఒకరి మృతి

అద్దంకి రూరల్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఒంగోలు నుంచి అద్దంకి మీదుగా వినుకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అద్దంకిలోని నామ్ రహదారిపై ఉన్న పాత పెట్రోలు బంకు వద్దకు రాగానే ఆగిఉన్న సెంట్రింగ్ లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్‌పై కూర్చున్న నాగులపాడు గ్రామానికి చెందిన అద్దంకి బ్రహ్మయ్య(30) ట్రాక్టర్ మీద నుంచి ఎగిరి కిందపడ్డాడు. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా బ్రహ్మయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

భాష్యం విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని భాష్యం విద్యాసంస్థల క్యాంపస్‌లలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలతో ఆయా క్యాంపస్‌ల ప్రాంగణాలను అందంగా అలంకరించారు. భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగి పళ్లు పోశారు. ఈసందర్భంగా భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగగా సంక్రాంతికి ప్రత్యేకత ఉందని, సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని అన్నారు. ఈసందర్భంగా ఆయన చంద్రమౌళీ నగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.

కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్‌లో సంక్రాంతి సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్ 4వ లైనులోని కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాల, బాలికలు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో భోగిమంట వేసి, అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ఉపాధ్యాయులు చిన్నారులకు భోగి పళ్లు పోశారు. బొమ్మలకొలువు, హరిదాసు, గొబ్బెమ్మలు, గాలి పటాలతో సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, కె.శ్రీవిద్య, సెంటర్ హెడ్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి

గుంటూరు లీగల్: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత సూచించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సామాజిక విజ్ఞాన కళాశాలలో వనరుల నిర్వహణ, వినియోగదారుల శాస్త్రాన్ని అభ్యసిస్తున్న దాదాపు 66 మంది విద్యార్థులు మంగళవారం జిల్లా వినియోగదారుల కమిషన్ సందర్శించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, కమిషన్ సభ్యులు కె.విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డి కేసులు విచారిస్తూ ఉండగా విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం వినియోగదారులకు సంబంధించి విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహాలను సునీత నివృత్తి చేశారు.

సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న మైనర్ అరెస్ట్

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న బాలుడిని హోంగార్డు పట్టుకుని పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. విశ్వసనీయం సమాచారం మేరకు కర్నూలు ప్రాంతానికి చెందిన ఓ బాలుడు ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీకి పాల్పడ్డాడు. బస్టాండ్ అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు సయ్యద్ సంధాని చోరీ చేయటాన్ని గమనించాడు. బాలుడిని వెంట పడి పట్టుకుని పాతగుంటూరు పోలీసుస్టేషన్ అప్పజెప్పినట్లు తెలుస్తోంది. బాలుడుని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంటి ముందు నిర్మాణ విషయంలో గొడవ పడి ఒక వ్యక్తిపై మరో కుటుంబ సభ్యులు దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కవితా నగర్‌లో నివశించే ఈదులమూడి మధుబాబు ఇంటి వెలుపల పక్కన ఉండే వారు ఇటుకలతో నిర్మాణం చేస్తున్నారు. ఈ కారణంగా మధుబాబు ద్విచక్రవాహనం ఇంట్లోకి తీసుకెళ్లేందుకు వీలుపడలేదు. ఈవిషయమై రెండు కుటుంబాల వారు గొడవ పడ్డారు. మధుబాబును పక్కింటిలో ఉండే మురళి, అతని కుటుంబ సభ్యులు దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బృందావన్‌గార్డెన్స్ 3వలైనులో చంద్రారావు (43) నివశిస్తుంటాడు. చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక సమస్యల్లో పడ్డాడు. మానసికంగా కుంగిపోయి మంగళవారం తన గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. అతని భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

నేటి నుంచి 16 వరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ



ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నేటి నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులు, కోచ్ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ వలన రెండేళ్లు సంక్రాంతి సంబరాలు నిర్వహించలేదని, ఈ ఏడాది అంబరాన్నంటేలా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 11వ తేదీ నుంచి 16 వరకు బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంబరాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం ఆటల పోటీలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ బృందం స్కిట్‌లు, ప్రముఖ గాయకుల గానామృతం ప్రజలను అలరిస్తాయన్నారు. సంబరాల్లో భాగంగా 11, 12 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. 13 నుంచి భోగి పళ్ళు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, ముగ్గుల పోటీలు, కూచిపూడి నాట్య పోటీలు జరుగుతాయన్నారు. 16 సాయంత్రం పోటీల్లో గెలిచిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా శాప్ నుంచి కోచ్ ల తీసుకుంటామని, సంబరాల నిర్వహణకు అధికారులతో ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ భాను ప్రకాష్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఈఈ సుందర్ రామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, ఎస్.ఎస్. సోమశేఖర్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు కన్నా మాస్టర్, మేకల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: దేశంలోనే సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు ఆంధ్రరాష్ట్రమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 56వ డివిజన్ నెహ్రూ నగర్‌లో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, శ్రీనివాస్ నేతృత్వంలో అయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీ అనంత పద్మనాభస్వామి వారి విగ్రహాన్ని ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే సంతోషాల సరదాల పండుగ అన్నారు. పండుగల విశేషాలను చాటి చెప్పేలా ఇటువంటి సంబరాలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి సంబరాలు నిర్వహిస్తున్నారని, ఐదు రోజుల పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నారికట్ల శ్రీనివాసరావు, శృంగారపు శ్రీనివాసరావు, అబ్దుల్ సలామ్, రేగంట్ల హుస్సేన్, ఉమామహేశ్వరరావు, నాగరాజు, వాసు పాల్గొన్నారు.

దిశ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, చిత్రంలో ఎస్‌హెచ్‌ఓ నరేష్

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్‌హాఫీజ్ మంగళవారం దిశ పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది పనితీరు, నైట్ డ్యూటీ విధుల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్‌హెచ్‌ఓ బి.నరేష్‌ను అడిగి తెలుసుని, కేసులు పెండింగ్ లేకుండా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ రూంను పరిశీలించి చిన్నారులు ఆడుకునే విధంగా, మహిళలకు అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మహిళల రక్షణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్టేషన్‌లో అందుబాటులో ఉండాలన్నారు.

పుట్టలమ్మతల్లి ఆలయంలో సంక్రాంతి సంబరాలు



గుంటూరు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామ ప్రజలు నిర్వహించే పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి ఉత్సవాలు ఈనెల 11వ తేదీనుంచి కనుల పండుగగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలోని ఆలయ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులపాటు నిర్వహించే ఈ సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఈనెల 11, 12వ తేదీలు బుధ, గురువారాల్లో డబుల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఔట్‌డోర్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామన్నారు. 13వ తేదీన ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరు కానున్నారన్నారు. అదేరోజు మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనాలనుకునే మహిళలు ముందుగా తమ పేర్లను 9490642637, 7386242526, 9848454568 సెల్ నంబర్లలో నమోదు చేసుకోవాలన్నారు. 14వ తేదీన ఆలయంలో ఉదయం 5 గంటలనుంచి ప్రత్యే పూజలు హోమాలు వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు దెందుకూరి రాంబాబు తెలిపారు. 15వ తేదీన ప్రత్యేక పూజలు, హోమాలు అభిషేకాలు జరుగుతాయన్నారు. 16వ తేదీన ఉదయం పూజా కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

పాత గుంటూరు: ఈ నెలాఖరుకు రెవెన్యూ వసూళ్లు 65 శాతం అధిగమించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో రెవెన్యూ వసూళ్ల వేగవంతం, షాప్ లీజులు, ఆక్షన్లు, రెన్యూవల్స్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 31న రెవెన్యూ వసూళ్ళలో రాష్ట్రస్థాయిలో తొలి స్థానంలో గుంటూరు నగర పాలక సంస్థను ఉంచేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ రూ.144 కోట్లకు గాను రూ.75 కోట్లు వసూళ్లు చేయుట జరిగిందని, మిగిలిన బకాయి వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. 2 లక్షలలోపు బకాయిలున్న పన్ను వసూళ్లకు సంబంధిత వార్డు కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని, రూ. 2 లక్షలు దాటిని పన్ను వసూళ్ళ పై రెవెన్యూ అధికారులు భాధ్యత వహించి, తదుపరి సమావేశంలో వారే వివరణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నగరంలో ప్రతి గృహానికి నూతనంగా ఏర్పాటు చేసిన డోర్ నెంబర్‌తో పాటు అసెస్మెంట్ నెంబర్, ఇంటి కుళాయి నెంబర్ వివరాలతో పెయింటింగ్ చేయించాలని తెలిపారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో పన్ను వసూళ్లు తక్కువగా ఉన్న రెవెన్యూ వార్డులలో బుధవారం నుంచి మొదలుపెట్టాలని ఆదేశించారు. నీటి చార్జీల వసూళ్ళను ఎమినిటీ కార్యదర్శులతో కలిసి వేగవంతం చేయాలన్నారు. రాబోవు 15 రోజుల్లో ఖాళీ స్థల పన్నుల వసూళ్ల స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. నగర పాలక సంస్థలో 25 సంవత్సరాలు దాటిన దుకాణాలకు ఆక్షన్ నిర్వహించాలని, 3 సంవత్సరాలు దాటిన దుకాణాలకు రెన్యువల్స్ వెంటనే చేయాలని ఆర్ఐ, ఆర్ఓలను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న జగనన్న భుహక్కు- భూ రక్షలో భాగంగా జరుగుతున్న రీసర్వే పై సమీక్షించి, వచ్చే వారం నాటికి ప్రతి ఒక్క కార్యదర్శి 50 శాతం చేయాలని ఆదేశించారు. పెదపలకలూరు, నందివెలుగు రోడ్డు, ఏటీ అగ్రహారం, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు, డొంక రోడ్డు, శారదా కాలనీ రోడ్డు విస్తరణలో వచ్చే శుక్రవారం నాటికి ఆగిన గృహాల తొలగింపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్దిరోజా, డెప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మూర్తి, డీసీపీలు, ఏసీపీలు, టీపీఎస్‌లు, ఆర్ఓలు, ఆర్ఐలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: వెంగళరావు నగర్ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు ట్రెడిషనల్ వేషధారణలలో అలరించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టతను చిన్నప్పటినుంచే విద్యార్థులందరూ తెలుసుకోవాలని పాఠశాల హెచ్ఎం పి.రమేష్ తెలియజేశారు. ఉపాధ్యాయులు సుష్మారెడ్డి జ్యోతి, విద్యాకమిటీ చైర్మన్ చందు పవన్ కుమార్, కమిటీ మెంబర్ పీటర్ పాల్ పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

పిల్లల్లో ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించాలి

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



విజ్ఞాన్ స్కూల్లో మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు ఎడ్యుకేషన్: పిల్లల్లోని కళలను, ఆసక్తులను తల్లిదండ్రులు గుర్తించి వారిని ఆ దిశగా ప్రోత్సహిస్తే ఉన్నతంగా ఎదుగుతారని విజ్ఞాన్ గ్రూప్స్ వైస్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ విజ్ఞాన్ విజ్ఞాన్ పాఠశాలల ద్వారా పాఠశాల ఎంతో మందిని ఉన్నతంగా తీర్చిదిద్దామని, ప్రస్తుతం పిల్లలు ఫోన్లలో నిమగ్నం అవుతున్నారని, అలాకాకుండా ఆట స్థలాల్లో సమయం గడిపేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. పిల్లల వైద్యనిపుణుడు గొంది కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. దానం చేసే గుణాన్ని అలవరచు కోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విజ్ఞాన్ స్కూల్ జోనల్ ఇనిచార్జ్ డాక్టర్ వి.అనురాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండుగల విశిష్టత తెలియజేయాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ అరుణ, డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్: విద్యార్థులకు తెలుగు జాతి సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయాలని, విద్యార్థులంతా పండుగల గురించి తెలుసుకునేలా వివరించాలని మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేట ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ పాశ్చాత్య జీవన శైలికి అలవాటు పడడంతో ప్రతి ఒక్కరికి సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయాల్సిన అవశ్యకత నేడు నెలకొందన్నారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కార్పొరేటర్‌లు పోతురాజు సమత, రవి, శివాలయం చైర్మన్ సతీష్, బీజేపీ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, రమాదేవి, సురేష్ జైన్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు డాక్టర్ఉమా శంకర్, డాక్టర్ అరుణలు బహుమతులు అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విశ్రాంత ఉపాధ్యాయ సంఘం కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీలు


గుంటూరు ఎడ్యుకేషన్: విశ్రాంత ఉపాధ్యాయులు సైతం ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం విశ్రాంత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో 'విశ్రాంత ఉపాధ్యాయ సంక్షేమం-ప్రభుత్వ బాధ్యతలు' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సంఘటిత శక్తిని బలోపేతం చేసుకోని పక్షంలో బలమైన ప్రభుత్వాలచే అణచివేతకు గురవుతారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు నెల, నెలా తమ పెన్షన్ల కోసం ట్రెజరీ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాల్సి రావడం ప్రభుత్వాలకు మంచిది కాదన్నారు. ఉత్తరాంధ్ర మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు, హెల్త్‌కార్డులకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. రాజగోపాల్ మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షనర్లు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సాంకేతిక విధానంలో పెన్షనర్లకు మెరుగైన సేవలందిస్తున్నామని, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ట్రెజరీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. సదస్సులో ట్రెజరీ అసోసియేషన్ నాయకుడు పి.నాగరాజు, విశ్రాంత డీఈఓ జి.నరసింహారెడ్డి, విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ పీవీ శేషుబాబు, విశ్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీవీఎస్ మణి, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిట్టలదొర, ఎడ్ల బండ్లు, గాలిపటాలతో గ్రామీణ వాతావరణాన్ని తలపింపచేశారు. భోగి మంటలు వేసి, పొంగళ్లు వండి, కోలాటంతో ఉపాధ్యాయినులు సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర హనుమంతరావు, కోశాధికారి చేకూరి రామకోటేశ్వరరావు, సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న విద్యా కల్యాణరామన్

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 176వ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా కల్యాణరామన్ గాత్ర కచేరీ సంగీతాభిమానులను అలరించింది. అనేక త్యాగరాజ కృతులను శాస్త్రీయంగా ఆలపించారు. వీరికి వయోలిన్‌పై బీవీ దుర్గా భవాని, మృదంగంపై బుర్రా శ్రీరామ్ వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ సహాయ కార్యదర్శులు ఎస్.గిరిజాశంకర్, వల్లూరి కృష్ణ కిషోర్ కళాకారులను మొమెంటోలతో సత్కరించారు. అనంతరం లఘు కచేరీలలో రాజేశ్వరి, ఎస్.కల్యాణి, పద్మావతి, ఆర్‌పీఎల్ నరసింహారావు గాత్ర కచేరీలు, లక్ష్మీశ్రీనివాస్ వీణ కచేరీలు నిర్వహించారు. వయోలిన్‌పై పి.గోవర్ధనరావు, మృదంగంపై సీహెచ్ సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు.

శేకూరులో పశువుల చావిడి దగ్ధం

శేకూరుపాలెం(చేబ్రోలు): ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల చావిడి, ఐదు పశువులకు తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం శేకూరుపాలెంలో మంగళవారం జరిగింది. శేకూరుపాలెం ప్రాంతానికి చెందిన రైతు గేరా శివ నాగయ్య, బసవమ్మ దంపతులు పశుపోషకులుగా జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నివసిస్తూ గ్రామ చివరలో పశువులకు చావిడి నిర్మించారు. దానిలో మూడు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. పశువుల పనులు ముగించుకొని ఇంటికి వచ్చి రాత్రి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తూ పశువుల చావిడికి నిప్పు అంటుకొని పాక పూర్తిగా కాలిబూడిదైంది. అందులో ఉన్న మూడు గేదెలు, రెండు దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు రెండు లక్షల విలువ చేసే గేదెలు కాలిన తీవ్ర గాయాలతో అవస్థలు పడ్డాయి. సంచార పశు వైద్య వాహనానికి సమాచారం అందజేయటంతో రెండు వాహనాలు అక్కడకు చేరుకొని పశువులకు వైద్య సేవలు అందించాయి. నిరుపేద కుటుంబానికి చెందిన గేర శివ నాగయ్య అగ్ని ప్రమాదంతో నష్టపోయాడు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పశువైద్యాధికారికి, సంచార పశు వైద్య సిబ్బందికి సూచించారు. నష్టపోయిన గేరా శివ నాగయ్య, బసవమ్మ దంపతులకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, మాతంగి శ్యాంబాబు పాల్గొన్నారు.



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్–వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం



తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–19, 21–14తో యంగ్ ఎన్గా టింగ్–యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12–21, 21–17, 14–21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10–21, 8–21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్–కృష్ణప్రసాద్ ద్వయం 10–21, 18–21తో కాంగ్ మిన్ హుక్–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 14–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్–జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్–త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి–గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.


కోహ్లి సెంచరీ అభివాదం

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలి షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్


షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–143, 2–173, 3–213, 4–303, 5–330, 6–362, 7–364. **బౌలింగ్:** కసున్ రజిత 10–0–88–3, మదుషంక 6–0–43–1, హసరంగ 10–0–67–0, కరుణరత్నే 8–0–54–1, దునిత్ 8–0–65–0, షనక 3–0–22–1, ధనంజయ 5–0–33–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–19, 2–23, 3–64, 4–136, 5–161, 6–178, 7–179, 8–206. **బౌలింగ్:** షమీ 9–0–67–1, సిరాజ్ 7–1–30–2, పాండ్యా 6–0–33–1, ఉమ్రాన్ 8–0–57–3, చహల్ 10–0–58–1, అక్షర్ 10–0–58–0.

మా ఇల్లే పాన్ ఇండియా


శ్రుతిహాసన్

శ్రుతిహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రాలతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో...

పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహా హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీర్ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీర్ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది

- ఎస్ఎస్ తమన్



''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతిహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం


● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశీ జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిశోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిశోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసూగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.

నా కల తీరుతోంది

- సంతోష్ శోభన్



''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.